పేపర్ బాయ్స్
కావలెను
సంచలన సాయంకాల పత్రిక 'సత్యం'లో పని చేసేందుకు పేపర్‌బాయ్స్ కావలెను.
- సంప్రదించండి -
94414 66455

అడ్మిషన్లు జరుగుచున్నవి
రవాణా సదుపాయం కలదు
డాక్టర్ దండి సూర్యనారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ వారి
శ్రీ శ్రద్ధ ప్లేస్కూల్
(LKG to 5th Class) A/C
Right Place for Right Education
కామేశ్వరి కళ్యాణమండపం దగ్గర, నందల జంక్షన్, నక్కవీధి, కలెక్టర్ బంగ్లా రోడ్డు, శ్రీకాకుళం. 99893 03703

TET - సైకాలజీ, తెలుగు ఇంగ్లీష్
DSC - SGT, SA - సోషల్, తెలుగు, బయాలజీ
సోషల్ మెథడ్స్- ఉపేంద్రనాయుడు సార్ - జూలై 7th
సైకాలజీ, ట్రైమెథడ్స్, PIE- సైదులు సార్ - జూలై 12,13,14
రైల్వే(RRB)/SSC/కానిస్టేబుల్స్/SI/BANK
RPF AP
స్పెషల్ బ్యాచ్: అర్థమెటిక్, రీజనింగ్, ప్యూర్ మేథ్స్ 'చలం' రవి, M.వేణుగోపాల్, మల్లిక్, Ch.శంకర్, కృష్ణమూర్తి, Sirsచే
9AM - 7PM సెమినార్, 10 రోజులు ఫ్రీ డెమో క్లాసులు
SOLVE ACADEMY
పౌర గ్రంథాలయం, వైజాగ్-16 | RTC కాంప్లెక్స్, శ్రీకాకుళం
7569089825, 8688172010

సంచలన సాయంకాల పత్రిక
సత్యం
https://www.satyamdaily.net/
మంగళవారం 20-8-2024
సంపుటి: 20 సంచిక: 126
పేజీలు: 4 వెల: రూ.1

# ఈసారైనా 'రింగు' తిరుగుతుందా?!

- ✔ మరోసారి తెరపైకి శ్రీకాకుళం ఔటర్ రింగ్‌రోడ్డు
- ✔ 11 ఏళ్ల నుంచి నలుగుతున్న ప్రతిపాదనలు
- ✔ ఉడా నుంచి నగరాన్ని తప్పించడంతో నిధుల సమస్య
- ✔ ఈ ప్రాజెక్టును పూర్తిగా విస్మరించిన గత సర్కారు
- ✔ ఇప్పుడైనా ప్రభుత్వం సహకరిస్తేనే ఓఆర్ఆర్ సాకారం



- ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో దిగి గూడెం మీదుగా పాత్రునివలస స్టేడియం పక్క నుంచి సానివాడ రోడ్డు మీదుగా కలెక్టరేట్‌కు వంద అడుగుల రోడ్డులో రయ్‌మని దూసుకుపోతే ఎలా ఉంటుంది?
- నగరం మధ్యలో ఉన్న పెద్ద పెద్ద గొడౌన్లు, హోల్‌సేల్ వ్యాపారాలు నగరానికి ఆనుకొని మూడు నియోజకవర్గాలకు విస్తరించి ఉండే రోడ్డులోకి మారిపోతే ఎలా ఉంటుంది?
- నగరమంటే జీటీ రోడ్డు, కళింగ రోడ్డు, పాలకొండ రోడ్లే కాకుండా 540 ఎకరాల్లో విస్తరించి ఉన్న వంద అడుగుల రోడ్డుకు అటు ఇటు మల్టీలెవెల్ కాంప్లెక్స్‌లు వస్తే ఎలా ఉంటుంది?

.. ఇవన్నీ ఊహించుకోడానికి బాగుంటాయి కానీ వాస్తవరూపం దాల్చేదెప్పుడు అనే ప్రశ్న సగటు జీవిలో తలెత్తితే.. ఆ తప్పు మనది కాదు, కచ్చితంగా పాలకులదే. పంపకాలు తప్ప ప్రగతి మీద దృష్టి సారించని గత పాలకుల పుణ్యమాని ఇలాంటి ప్రాజెక్టులు పట్టాలెక్కడంలేదు. కానీ సంకల్పం ఉంటే చేయొచ్చని, పైన చెప్పుకున్నవన్నీ జరగొచ్చని నిరూపించింది విజయనగరం. ఒకప్పుడు శ్రీకాకుళం కంటే విజయనగరం పేద జిల్లా. మరీ ముఖ్యంగా కమర్షియల్ వాల్యూ లేని జిల్లా. అటువంటిది రింగ్‌రోడ్డు వచ్చిన తర్వాత విజయనగరం హెడ్ క్వార్టర్‌కు 30 కిలోమీటర్ల దూరంలోని విశాఖ పట్నంలో ఉన్న ప్రతి వసతి ఇప్పుడు విజయనగరంలో కనిపిస్తోంది. ఇందుకు కారణం.. ఒకేఒక్కటి. అది ఔటర్ రింగ్‌రోడ్డు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శ్రీకాకుళంలోనూ మళ్లీ ఔటర్ రింగ్‌రోడ్డు ఆశలు మొలకెత్తాయి.

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా కేంద్రం శ్రీకాకుళం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించాలన్న ప్రతిపాదన చాన్నాళ్ల నుంచే ఉంది. వైకాపా ప్రభుత్వ హయాంలోనూ ఓసారి దీనిపై చర్చించారు. మాస్టర్ ప్లాన్‌లో పేర్కొన్న రింగ్‌రోడ్డుకు అవసరమైనన్ని నిధులు కేటాయించలేం కాబట్టి దాని పరిధిని కుదిస్తే నిధులు మంజూరు చేస్తామని ప్రభుత్వం చెప్పింది. ఆ మేరకు శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్(సుడా) అధికారులు ఓ ప్రతిపాదన సిద్ధం చేసినా దానిపై ప్రభుత్వం స్పందించలేదు. పైసా విదల్చలేదు. వాస్తవానికి 20 ఏళ్లకోసారి నగరానికి కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించాలి. ఆ మేరకు శ్రీకాకుళం నగరానికి కొత్త మాస్టర్‌ప్లాన్ రూపొందించినప్పుడే ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణాన్ని ప్రతిపాదించారు. దీనిపైనే ఇటీవల రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు సమీక్షించారు. నిజంగా ప్రభుత్వం దీనిపై ముందుకు వస్తే, స్థానిక నాయకులు నచ్చించో, ఒప్పించో రైతుల నుంచి భూములు సేకరించగలిగితే శ్రీకాకుళం రూపురేఖలు పూర్తిగా మారిపోతాయి. ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే మాస్టర్ ప్లాన్‌లో కనిపిస్తున్నంత కలర్‌ఫుల్‌గా ఈ ప్రాజెక్టు పట్టాలెక్కదు. ఎందుకంటే.. 540 ఎకరాలు సేకరించి 100 అడుగుల రోడ్డు వేయడమంటే చిన్న విషయం కాదు. రోడ్డు మాత్రమే వేయడానికి ఏదో ఒక శాఖ ద్వారా కాంట్రాక్ట్ ఇచ్చేస్తే సరిపోతుంది.. కానీ దానికి ముందు 540 ఎకరాలు సేకరించడంలోనే స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రుల సత్తా బయటపడుతుంది. ఎందుకంటే నగరానికి ఆనుకొని ఉన్న పంట భూములకు విపరీతమైన ధర ఉంది. దీనికి తోడు 2013 భూసేకరణ చట్టం ప్రకారం రిజిస్టర్డ్ వాల్యూ కంటే రెండున్నర రెట్లు అధికంగా పరిహారం చెల్లించాలి. ప్రభుత్వం దీని కోసం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలి. కానీ అది కుదిరే పనికాదు. అందువల్ల అడుగుల రోడ్డు వస్తే భూముల ధరలు అమాంతం పెరుగుతాయని, వ్యవసాయ భూమిగా ఉన్నది కమర్షియల్ భూమిగా మారుతుందని ఒప్పించగలగడంలోనే నేతల చాతుర్యం బయటపడుతుంది. వాస్తవానికి రాజశేఖర రెడ్డి హయాం తర్వాత భూసేకరణ అంశంలో ప్రభుత్వాలు క్రియాశీలంగా వ్యవహరించడంలేదు. ఎందుకంటే.. వారి మొదటి ప్రాధాన్యత సంక్షేమం అయిపోయింది. అందుకే కొత్తగా టీడీఆర్ బాండ్ల సౌకర్యాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 100 గజాల భూమి రైతు నుంచి తీసుకుంటే 400 గజాలకు టీడీఆర్‌లు ఇస్తుంది. 100 గజాల భూమికి ప్రభుత్వం ఇచ్చే రేటుకంటే 400 గజాలకు ఇచ్చే టీడీఆర్‌ల విలువ కాస్త ఎక్కువే అయినా ఆ మేరకు రైతులను ఒప్పించగలిగేవారు కావాలి. ప్రస్తుతం కొత్తగా అమలుచేయాల్సిన మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. ఈ నెలతో ఆ గడువు కూడా ముగుస్తుంది. మాస్టర్‌ప్లాన్ మేరకు నగరంలో నిర్మాణాల పరిస్థితి పక్కన పెడితే, ఔటర్ రింగ్ రోడ్డు వస్తే నగరంలో ట్రాఫిక్ సమస్యలు తీరిపోతాయి. మొన్నటి వరకు జీటీ రోడ్డులో మాత్రమే సెంటర్ పార్కింగ్‌తో ఇబ్బందులుండేవి. ఇప్పుడు కళింగ రోడ్డు కూడా అదే పరిస్థితికి దిగజారిపోయింది. రింగ్‌రోడ్డు నిర్మాణం పూర్తయితే గానీ శ్రీకాకుళంలో నడిచే పరిస్థితి కనిపించడంలేదు.

**11 ఏళ్లు.. ఎన్నో ప్రతిపాదనలు**

శ్రీకాకుళం నగరం చుట్టూ ఔటర్ రింగ్‌రోడ్ (ఓఆర్ఆర్) నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చి ఈ ఏడాదిలో పనులు ప్రారంభించేలా ప్రణాళిక రూపొందించాలని ఈ నెల 13న కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. నగరం చుట్టూ 36 కిలోమీటర్ల పొడవునా 100 అడుగుల వెడల్పుతో 18 గ్రామాలను కలుపుతూ రింగ్ రోడ్డు నిర్మిస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా 80 అడుగుల రోడ్డులో నిర్వహించిన బహిరంగ సభలోనూ చంద్రబాబు ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఓఆర్ఆర్ ప్రతిపాదన 11 ఏళ్ల నుంచి నలుగుతోంది. 2019 ఫిబ్రవరిలో ఉడా నుంచి శ్రీకాకుళాన్ని విడగొట్టి సుడాగా మార్చుతూ టీడీపీ ప్రభుత్వం నిర్ణయంతో ఉడా నుంచి నిధులు నిలిచిపోయి ఓఆర్ఆర్ ప్రతిపాదన అటకెక్కిందన్న విమర్శలు ఉన్నాయి. నగర అవసరాలు, ట్రాఫిక్ నియంత్రణకు వీలుగా 2013లోనే ఔటర్ రింగ్‌రోడ్డు ప్రతిపాదనను మాజీ మంత్రి ధర్మాన తెరపైకి తెచ్చారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2015 ఫిబ్రవరి 14న సీఎం చంద్రబాబు నరసన్నపేటబహిరంగ సభలో శ్రీకాకుళం రింగ్‌రోడ్డుపై ప్రకటన చేశారు. అదే ఏడాది జూన్ 10న రింగ్‌రోడ్డు నిర్మాణ సాధ్యాసాధ్యాల పరిశీలనకు ఉడా వైస్‌చైర్మన్, చీఫ్ ఇంజినీర్, డీఈ, పట్టణ ప్రణాళిక అధికారులతో కూడిన బృందం నగరంలో పర్యటించింది. నగరానికి 12 కిలోమీటర్ల పరిధిలోని పొన్నాడ బ్రిడ్జి, ఖాజీపేట, అరసవల్లి, పాత్రునివలస, నవభావత్ జంక్షన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి రోడ్ల పరిస్థితి, భూసేకరణ తదితర అంశాలను రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. అనంతరం మూడు రకాల ప్రతిపాదనలు రూపొందించినా ప్రాజెక్టు పట్టాలెక్కలేదు.

**గత ప్రభుత్వంలో తెరమరుగు**

అక్కడికి మూడేళ్ల తర్వాత 2018 ఆగస్టు 15న జిల్లా కేంద్రంలో నిర్వహించిన - మిగతా 4లో




# అడకత్తెరలో మమత!

- ప్రభుత్వం నిర్వహించే ఆసుపత్రిలో అంత ఘోరమా?: మమత ప్రశ్న
- దేశవ్యాప్తంగా నిరసనకారులు ప్రశ్నిస్తున్నది కూడా అదే కదా!
- సమస్యను పరిష్కరించలేక అపసోపాలు పడుతున్న బెంగాల్ ముఖ్యమంత్రి

- దుప్పల రవికుమార్

పశ్చిమ బెంగాల్ రాష్ట్ర రాజధాని కలకత్తాలో జరిగిన రేప్ అండ్ మర్డర్ కేసు తిరిగితిరిగి ఆ రాష్ట్ర ప్రభుత్వ మెడకు చుట్టుకున్నట్టే కనిపిస్తోంది. విధుల్లో ఉన్న ఒక జూనియర్ డాక్టరును అత్యంత పాశవికంగా నేరస్తుడు మానభంగం చేసి, హత్య చేసినా పట్టించుకునే నాధుడు కనిపించకపోవడం ఒక్క కోల్‌కతానే కాదు యావద్దేశాన్ని కదిలించింది. మెల్లగా నిరసనలు ఊపందుకుంటున్నాయి. హత్య జరిగిన తీరు చూస్తుంటే ఇది నిర్భయ కేసును మించిందనిపిస్తోంది. హతురాలి శరీరంపై 16 చోట్ల, లోపల అంతర్గత అవయవాలకు తొమ్మిది చోట్ల గాయాలైనట్టు పోస్ట్‌మార్టం నివేదిక చెప్తోంది. హత్య జరిగిన తర్వాత హాస్పిటల్ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం నడుచుకున్న తీరు మాత్రం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ హత్యపై సమగ్రమైన దర్యాప్తు నిర్వహించి, నిందితులను కఠినంగా శిక్షించడం ద్వారా సమాజానికి అద్భుతమైన సందేశం పంపించినట్టవుతుందని జూనియర్ డాక్టర్లు, ఇతర వైద్యులు, ప్రజా సంఘాలు కలకత్తాలో రోడ్డెక్కితే, వారి సందేహాలను నివృత్తి చేయాల్సిన ముఖ్యమంత్రి ఆశ్చర్యకరంగా మరొక నిరసన ప్రదర్శన తీయడం యావద్దేశాన్ని విచారంలోకి నెట్టింది.




ఇందులో విడ్డూరమైన విషయం ఏమంటే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆసుపత్రులను నియంత్రించే ఆరోగ్య శాఖను మాత్రమే కాక ప్రజల శాంతి భద్రతలను కాపాడే హోం శాఖను కూడా స్వయంగా నిర్వహిస్తున్నారు. దర్యాప్తునకు ఆదేశించగల అధికారం చేతిలో ఉండి, ప్రజలకున్న అన్ని అనుమానాలను తొలగించగలిగే అవకాశముండి, నిందితులను కఠినంగా శిక్షించగలిగే హోదాలో ఉండి కూడా చేతులు ముడుచుకుని మమతా బెనర్జీ ఉండడం, నిస్సహాయంగా సిబిఐ విచారణకు డిమాండ్ చేయడం విచిత్రం. దాదాపు మూడు దశాబ్దాలకు పైబడి కమ్యూనిస్టులకు కోటగా ఉండిన పశ్చిమబెంగాల్‌లో అధికారం చేజిక్కించుకోవడం అంటే మాటలు కాదు. ఎంతో పోరాటం చేసి దుర్భేద్యమైన కోటలో ప్రవేశించిన ఫైర్‌బ్రాండ్ మమత, ఇలాంటి కీలకమైన సమయంలో చేష్టలుడిగి మౌనంగా నిల్చోవడం ఆమె అభిమానులతో పాటు సాధారణ ప్రజలు కూడా అర్థం చేసుకోలేకపోతున్నారు. మమత పతనానికి బీజాలు పడ్డాయని సందేహిస్తున్నారు. దుర్ఘటన జరిగిన రోజు నుంచీ హతురాలి తల్లిదండ్రులు, ఇతర జూనియర్ డాక్టర్లతో పాటు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తోన్న అంశాలనే ఇప్పుడు పది రోజుల తర్వాత ముఖ్యమంత్రి కూడా డిమాండ్ చేయడం విస్తుగొలుపుతోంది. ఆ రాష్ట్ర ప్రభుత్వం, ఆరోగ్య శాఖ, పోలీసు శాఖ బదులివ్వాల్సిన అనేక ప్రశ్నలు కేవలం ఆమె నోరు విప్పితే కాని, ప్రజలకు తెలిసేవి కావు.

**జవాబు చెప్పాల్సిన ప్రశ్నలు**

ఆ వైద్యురాలి శరీరంపై రక్తమోడుతున్న అన్ని గాయాలు ఉన్నాయి. శరీరం కింది భాగంపై ఎలాంటి దుస్తులూ లేవు. అయినప్పటికీ ఆమె ఆత్మహత్య చేసుకుందని ఆసుపత్రి వర్గాలు ఆమె తల్లిదండ్రులకు ఎందుకు చెప్పారు? అందరినీ పట్టిపీడిస్తోన్న అసలు ప్రశ్న ఇదే. ఆమె తల్లిదండ్రులతో పాటు ఉన్న దగ్గరి బంధువు లల్లంతాప్ ఒక ఇంటర్వ్యూలో చెప్పిన దాని ప్రకారం మృతదేహం కాళ్లు ఒకదానికొకటి 90 డిగ్రీల ఎడంలో పరుచుకుని ఉన్న పరిస్థితిలో వారు చూసినట్టు తెలిపారు. క్రైం సీన్ ఫోటోలు ఈ విషయాన్ని ధృవీకరించాయి. ఆ రాత్రి ఆర్‌జి కార్ ఆసుపత్రి నుంచి ఆమె తల్లిదండ్రులకు రెండుసార్లు ఫోన్ వెళ్లింది. మొదట ఆమె పరిస్థితి బాగా లేదని వెంటనే బయలుదేరి రావాలని కోరారు. కాని, కాసేపట్లోనే ఆసుపత్రిలో ఆమె ఆత్మహత్య చేసుకుందని కబురందించారు. ఈ రెండు పొంతన లేని వాదనలు ఆసుపత్రి వర్గాలు ఎందుకు చేసినట్టు?

ఆసుపత్రికి వచ్చిన ఆమె తల్లిదండ్రులు తమ కూతురి మృతదేహాన్ని చూడనివ్వమని పోలీసులను ఎందుకు బతిమాలుకోవాల్సి వచ్చింది? ఒక లోకల్ ఛానెల్ ఇంటర్వ్యూలో ఆమె తల్లి విగతజీవిగా మారిన తమ బిడ్డ ఆఖరిచూపు చూసుకుంటామని పోరాడాల్సి వచ్చిందని చెప్పారు. పోలీసులు ఈ వాదనను ఖండించారు. కాని, వాస్తవమేమిటంటే గంటల తరబడి వేచిచూసాక మాత్రమే తల్లిదండ్రులను ఆ మృతదేహం వద్దకు పంపించారు. వీరు అంతసేపూ ఆసుపత్రిలో ఛాతీ విభాగం






వద్ద నిరీక్షిస్తున్నారు. వీళ్లను కలుసుకోవడానికి ఆసుపత్రి వర్గాలు రాలేదు. కాని, నిలువరించడానికి పోలీసులను పంపారు. కాగా, ఈ విష యంలో పబ్లిక్‌ను తప్పుదోవ పట్టిస్తున్నాయని సోషల్ మీడియాపై పోలీసులు విరుచుకుపడుతున్నారు. ఈ ఇంటర్వ్యూలు ప్రసారం చేసిన చానెళ్లపై కేసులు పెడుతున్నారు. దుర్ఘటన జరగడానికి ఒకరోజు ముందే వైద్యురాలి కారును ధ్వంసం చేసారని ఆ ఛానెళ్లు చెప్తున్నాయి. బంధువులను ఆసుపత్రి నుంచి తరమ డానికి పోలీసులు తమ కళ్లెదుటే కారును ధ్వంసం చేసారని మృతురాలి తల్లి ఆరోపిస్తోంది.

**అనుమానాలకు తావిస్తోన్న ప్రిన్సిపాల్ వైఖరి**

విలేకరుల సమావేశంలో పదేపదే తన పేరును ప్రస్తావించిన ఆసుపత్రి కళాశాల ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌కు పోలీసులు ఇప్పటి వరకూ ఏమైనా నోటీసులు పంపించారా? దుర్ఘటన జరిగినప్పటి ఆర్‌జి కార్ ప్రిన్సిపాల్ చట్టవిరుద్ధంగా పలుమార్లు ఆమె పేరును ప్రస్తావించారు. ఇలాంటి హేయమైన సంఘటనలు జరిగినప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ బాధితురాలి ఐడెంటిటీని వెల్లడించకూడదని చట్టంలో ప్రముఖంగా ప్రస్తావించినప్పటికీ, దానిని అత్యంత నిర్లక్ష్యంగా ఉల్లంఘిస్తూ, ఆ మరునాడు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తొమ్మిది సార్లు బాధితురాలి పేరు ప్రస్తావించారు. కాగా కోల్‌కతా పోలీసులు ఇప్పటిదాకా సుమారు 200 నోటీసులు వివిధ సోషల్ మీడియా ప్రతినిధులకు పంపించారు. అనేక మందిపై ఎఫ్‌ఐఆర్ దాఖలు చేసారు. మరి బాధితురాలి గురించి వివరాలు వెల్లడి చేసిన ప్రిన్సిపాల్‌పై ఎలాంటి చర్యలు తీసుకున్నారో ఇప్పటికీ తెలియడం లేదు.

పని ప్రదేశంలో హింస జరపడంపై, అవినీతి ఆరోపణలున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ ఘోష్‌ను శిక్షించక పోగా, రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు సత్కరిస్తోంది? ఈ ప్రశ్న మనల్నే కాదు, ఏకంగా కోల్‌కతా హైకోర్టునే విస్మయపరుస్తోంది. విచ్చలవిడి అవినీతి, హుందాగా లేని ప్రవర్తన, విద్వేషపూరితమైన పని - మిగతా 4లో

● ఎడిటోరియల్

# పరపతి కోల్పోతున్న సీఎం మమత!

ఇప్పుడు మరో నిర్భయ కేసు దేశం మొత్తాన్ని కుదిపేస్తోంది. తాను పని చేస్తున్న ఆస్పత్రిలోనే హంతకుడి చేతిలో చిత్రహింసలు అనుభవించి, అత్యాచారానికి.. ఆపై హత్యకు గురైన ఒక జూనియర్ డాక్టర్ దారుణ ఘటనను జాతి యావత్తు గర్హిస్తోంది. హంతకులను కఠినాతికఠినంగా శిక్షించాలని ఘోషిస్తోంది. ఆందోళనలు, ధర్నాలతో హోరెత్తిస్తోంది. అయితే దారుణ ఘటనపై స్పందించి, తక్షణ చర్యలు తీసుకుని ప్రజాబాహుళ్యానికి నమ్మకం, భరోసా కల్పించాలని వ్యవస్థలు మాత్రం ఇందులోనూ సొంతి నిష్క్రియాపరత్వం ప్రదర్శిస్తున్నాయి. దీనికి కారణం.. రాజకీయ పాలకులు సొంత లాభం కోసం వెంపర్లాడటమే. ఒక యువ డాక్టర్‌పై జరిగిన అమానుషాన్ని కూడా రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడానికి ప్రయత్నించడం కంటే హీనమైన విషయం ఇంకొకటి ఉండదు. ప్రస్తుతం ఈ రాజకీయ రాక్షస క్రీడకు పశ్చిమ బెంగాల్ వేదికగా మారింది. ఆ రాష్ట్రంలో కమ్యూనిస్టుల కంచుకోటను బద్దలుగొట్టి, కాంగ్రెస్‌ను ఆనవాలు లేకుండా చేసి తిరుగులేని ఆధిపత్యం చెలాయిస్తున్న మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌ను ఇటీవలి కాలంలో భారతీయ జనతాపార్టీ తీవ్రంగా ప్రతిఘటిస్తోంది. పెను సవాళ్లు విసురుతోంది. ఫలితంగా రెండు పార్టీల కారణంగా గత కొన్నేళ్లుగా రాష్ట్రం రావణ కాష్టంలా రగులుతోంది. ఆ మధ్య ఇదే రాష్ట్రంలోని సందేశ్ ఖాలీలో జరిగిన అత్యాచారాలు, దాడులను అనుకూలంగా మలచుకునేందుకు బీజేపీ చేసిన యత్నాలను ఎదుర్కొనేందుకు ముఖ్యమంత్రి మమత నేతృత్వంలో తృణమూల్ కాంగ్రెస్ ఎదురుదాడికి దిగడం, ఘటనపై విచారణకు వచ్చిన సీబీఐ అధికారులను ఆ పార్టీ కార్యకర్తలు వెంటాడి పరుగులు పెట్టించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. దాన్ని మర్చిపోకముందే తాజాగా కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో నైట్‌డ్యూటీలో ఉన్న జూనియర్ డాక్టర్‌పై జరిగిన దారుణ హత్యాచారం విషయంలోనూ మమతా బెనర్జీతో పాటు ఆమె అడుగుజాడల్లో తృణమూల్ కార్యకర్తలు సైతం అదే పంథా అనుసరిస్తూ జనంలో మరింత పలుచన అయిపోతున్నారు. ముఖ్యంగా ఫైర్‌బ్రాండ్‌గా, బెంగాల్ ప్రజలతో దీదీగా పిలిపించుకునే మమతా బెనర్జీ పాలన గాడి తప్పుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటనలో మమతతో పాటు ఆమె ప్రభుత్వం వ్యవహరించిన, వ్యవహరిస్తున్న తీరుపై బాధితురాలి తల్లిదండ్రులే కాకుండా ఆ రాష్ట్ర ప్రజలు.. చివరికి కోర్టులు సైతం నిప్పులు కక్కుతున్నాయంటే మమత ఈ దారుణంపై ఎంత ఉదాసీనంగా, బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించారో అర్థమవుతుంది. రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపైనే ఉంటుంది. కానీ ఆ విషయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విఫలమయ్యారని యువడాక్టర్ హత్యాచారం ఘటన తర్వాత జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఘటన వెలుగులోకి వచ్చి దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్న తరుణంలో ముఖ్యమంత్రి కఠిన చర్యలు తీసుకోవాల్సిన మమత ఆ పని చేయకుండా తానే స్వయంగా రోడ్లపైకి వచ్చి నిరసన కార్యక్రమం నిర్వహించడం వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఆడుతున్న నాటకంగా కనిపించింది. ఇంకా విచిత్రమేమిటంటే సీఎం హోదాలో నిరసన ప్రదర్శన చేసిన ఆమె.. హత్యాచార ఘటనపై ఇతరులెవరూ ఆందోళనలు, నిరసనలు చేయడానికి వీల్లేదంటూ నిషేధాజ్ఞలు విధించడం ప్రజలను మరింత చిర్రెత్తించింది. ఒంటినిండా రక్తగాయాలతో, దాదాపు వివస్త్రగా ఆస్పత్రి ఆవరణలో జూనియర్ డాక్టర్ పడిపోయి ఉంటే.. సదరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సందీప్ బాధితురాలి తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని చెప్పడం ద్వారా తప్పించుకోవడానికి ప్రయత్నిస్తే అతనిపై కఠిన చర్యలు తీసుకోకుండా బదిలీ చేసి.. రెండు రోజుల్లోనే తిరిగి వేరే కళాశాలలో నియమించడం మమత ద్వారా తన చిత్తశుద్ధిపై అనుమానాలు పెరిగేలా చేసుకున్నారు. రాష్ట్ర పోలీసు వ్యవస్థ మొత్తం తన చేతుల్లోనే ఉన్నా.. చేతులు ముడుచుకున్న ఆమె మరోవైపు కేంద్రంపై నెపాన్ని నెట్టివేయడానికా అన్నట్లు సీబీఐ దర్యాప్తును ముమ్మరం చేయాలని, రెండురోజుల్లోనే నిందితుడిని పట్టుకుని ఉరి తీయాలని డిమాండ్ చేయడం ఫక్తు రాజకీయంలా కనిపించింది. మమత తీరుపై బాధితురాలి తల్లిదండ్రులే తీవ్ర విమర్శలు చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీదీ సర్కారు మహిళలను ఉద్ధరిస్తామంటూ పలు ఆర్థిక సహాయ పథకాలు అమలు చేస్తోందని, కానీ వారికి భద్రత మాత్రం కల్పించలేకపోతోందని మృతురాలి తల్లి ఆరోపించారు. మొదట భద్రత కల్పిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చి, నిందితులపై కఠిన చర్యలు తీసుకున్న తర్వాతే మమత సర్కారు ఇచ్చే ఆర్థిక పథకాలను పుచ్చుకోవాలని ఆమె మహిళాలోకానికి పిలుపునిచ్చారు. ఇక ఈ ఘటనపై తృణమూల్ కాంగ్రెస్‌లోనే భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు బయటపడుతోంది. ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో తృణమూల్ కాంగ్రెస్‌కు చెందినవారి ఆధ్వర్యంలో డ్రగ్స్ దందా నడుస్తోందన్న ఆరోపణలు చాలాకాలం నుంచే ఉన్నాయి. ఈ దందా గురించి జూనియర్ డాక్టర్‌కు తెలిసిపోవడం వల్లే తృణమూల్ వర్గాలే ఆమె హత్యకు కారణమయ్యాయన్న తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీన్ని కప్పిపుచ్చుకోవడానికే ఆందోళనకారుల ముసుగులో తృణమూల్ కార్యకర్తలు రాత్రివేళ ఆస్పత్రిపై దాడికి పాల్పడి యువడాక్టర్ మృతదేహం లభించిన సెమినార్ హాల్‌లో విధ్వంసం సృష్టించి ఆధారాలు లభించకుండా చేశారని అంటున్నారు. పైగా ఈ హత్యోదంతాన్నే సాకుగా చూపి ఏకంగా 42 మంది డాక్టర్లను ఒకేసారి బదిలీ చేయడం కూడా విమర్శల పాలైంది. ఉద్యమంలో పాల్గొన్నందుకే వారిని బదిలీ చేశారన్న విమర్శలు చెలరేగడంతో ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకతప్పలేదు. ఇవన్నీ చూస్తే హ్యాట్రిక్ సీఎంగా రికార్డు సృష్టించిన మమత తన పరపతిని తానే పతనం అంచుకు తీసుకెళ్తున్నట్లుంది.



# సమస్య లోతెంతో.. పట్టి చూపించిన ఫోటో!

**ఒక్క ఫోటో వంద పదాలకు సరిసమానమంటారు. కొన్ని ఫోటోలైతే పదాల సంఖ్యతో కూడా పోల్చలేని స్థాయిలో అనిర్వచనీయమైన అనుభూతిని మిగులుస్తాయి. ఇక మరికొన్నైతే అంతే ఆవేదనకూ నిలువెత్తు నిర్వచనయమైతాయి. ఘటనలు కాలగర్భంలో కలిసిపోయినా ఆ చరిత్రలను మన ముందుంచే ఫోటోలు కొన్ని ఉంటాయి. అలాంటి ఫోటో కథే ఇది!!**



అది 1945.. రెండో ప్రపంచ యుద్ధం. జపాన్ లోని హిరోషీమా -నాగసాకిపై కురిసిన బాంబుల వర్షానికి ఆ నగరాలు ఇప్పటికీ కోలుకోలేకుండా పోయి.. ఇప్పుడు హిరోషిమా, నాగసాకి ఓ డార్క్ టూరిజం డెస్టినేషన్స్‌గా మారాయి. ఓ చేదు చరిత్రను మిగిల్చిన యుద్ధభూమికి సాక్షీభూతంగా నిల్చాయి. ఆ యుద్ధ సమయంలో అమెరికా పెన్సిల్వేనియాకు చెందిన ప్రఖ్యాత ఫోటో జర్నలిస్ట్ జో ఓ డోనెల్‌ను యూఎస్ మిలిటరీ అక్కడి యుద్ధభూమికి పంపింది. ఆయన వెళ్లి తీసిన ఫోటోలు ఆయన్ని చిరకాలం ప్రపంచం మొత్తం మర్చిపోలేని ఫోటో జర్నలిస్ట్‌గా గుర్తింపునిచ్చి నిలబెట్టాయి.

పదేళ్ల వయసున్న ఓ బాలుడు.. తన వెనుకభాగంలో ఓ బిడ్డను మోస్తున్న ఫోటో ఇది. జపాన్లో ఆ రోజుల్లో.. పిల్లలు వారికంటే చిన్నవారిని వెనక్కి కట్టుకుని.. లేదా ముందు భాగంలో సంచీలాగా తగిలించుకుని ఆడుకునే దృశ్యాలు సర్వసాధారణం. అంతెందుకూ ఇప్పటికీ ప్రాశ్చాత్య దేశాలతో పాటు ఇప్పుడు మనదేశంలోనూ ఇలాంటి దృశ్యాలు విరివిగానే కనబడుతుంటాయి. అలాగే ఓ కుర్రాడు కూడా కాస్త భిన్నంగా ఫోటో జర్నలిస్ట్ జో ఓ డోనెల్ కంట పడ్డాడు. కానీ, ఆ పిల్లాడు నిల్చున్న ప్రదేశం ఓ శ్మశానం. వచ్చిన తీరు ఆందోళనకరం. కాళ్లకు చెప్పుల్లేవ్.. బూట్లు లేవ్. ముఖమంతా నిండిన నిర్వేదం. తన వీపుకి నిద్రపోతున్నట్లుగా ఓ శిశువు తల సంచీలోంచి వేలాడుతూ కనిపిస్తోంది. అప్పటికి ఆ మరుభూమిలో ఓవైపు మారణహోమంలో అసువులు బాసినవారి ఖననాలు, దహనాల ప్రక్రియ కొనసాగుతోంది. క్యూలైన్లలో చాలామంది నిల్చుని ఉన్నారు. వారిలో ఆ బాలుడొకడు. కానీ ఫోటో జర్నలిస్ట్ జో ఓ డోనెల్‌కు మాత్రం ఏదో అనుమానం కొడుతోంది. ఇంకేం.. తన మూడో కన్నూ తెరుచుకుంది. అలా కెమెరాలో ఆ బాలుడు వెనక్కి తగిలించుకున్న సంచీలో నిద్రిస్తున్నాడా అన్నట్టున్న మరో బాలుడి ఫోటో బంధించాడు. కానీ అంతలోకే కాటికాపరులు రానే వచ్చారు. అసలే బాంబుల మోతలు.. చనిపోయినవారి బంధువుల హాహాకారాలతో పాటు.. చీకటి కూడా దట్టంగా అలుముకున్న సమయమది. ఆ కాపరులు మెల్లగా బాలుడి వీపుకున్న సంచీ విప్పారు. అందులో విగతజీవైన ఆ శిశువును తీసి.. కాటిపై పెట్టారు. యథావిధిగా నిప్పంటించారు. అప్పటికే తన కెమెరా కన్నుతో ఎన్నో ఫోటోలను సజీవ సాక్ష్యాల్లా పట్టి బంధించిన.. ఆ ఫోటో జర్నలిస్ట్ కళ్లల్లోనూ నీళ్లు తిరిగాయి. ఇంకోవైపు.. ఆ యుద్ధంలో నా అన్నవాళ్లనందరినీ కోల్పోయి.. చివరాఖరకు తన సోదరుడి మృతదేహం కూడా కళ్లముందే దహనమైపోతుంటే.. కదలకుండా నిటారుగా నిశ్చేష్టంగా నిలబడ్డ ఆ బాలుడిలో.. కాలిబూడిదైపోతున్న సోదరుడు చితిమంటలను మించిన అశ్రుమంట కనిపించింది. కానీ ఎవ్వరికి చెప్పుకునేది.. ఆ సమయాన తన దుఖాన్ని ఎవరు తీర్చేది? తన ఆవేదనంతా జస్ట్ శ్మశానరోదనే!

కానీ ఆ బాలుడు తన దుఃఖాన్ని ఆపుకోలేని సమయంలో అతడి ఆక్రోషం, ఆవేదన అంతా అతను తన పెదవిని గట్టిగా కొరుక్కుంటున్నప్పుడు వెల్లువెత్తిన రక్తంలో కనిపించిందంటాడు ఫోటో జర్నలిస్ట్ జో ఓ డోనెల్. అప్పుడక్కడే ఉన్న ఓ గార్డ్ ఆ బరువుని నాకియ్ నేను పట్టుకుంటానంటే.. అది బరువు కాదు నా తమ్ముడన్న ఆ సోదరుడి అవ్యాజమైన ప్రేమకు సాక్షీభూతమైంది ఆ సందర్భం. అందుకే జో ఓ డోనెల్ బంధించిన 1945 రెండో ప్రపంచ యుద్ధపు ఫోటో.. జపాన్‌లో ఇప్పటికీ ధైర్యానికి చిహ్నంగా చూపిస్తుంటారు. నాటి రక్తచరిత్రకు నిలువెత్తు నిదర్శనంగా నిల్చిన ఆ ఫోటో చూసి దాని గురించి తెలుసుకున్నవారందరికీ ఆ బాలుడి బాధ ముందు తమ బాధల బరువెంత. తమ సమస్య లోతెంత అనే ప్రశ్నలు ఇప్పటికీ ఉదయిస్తూనే ఉంటాయట.

- రమణ కొంటికర్ల




# 'పుష్ప 2' భారమంతా దేవిశ్రీపైనే!

ఆగస్టు 15న రావాల్సిన 'పుష్ప 2' డిసెంబరుకు వెళ్లిపోయింది. డిసెంబరు నాటికైనా ఈ సినిమా వస్తుందా? రాదా? అనేది కొంత మంది అనుమానం. కానీ ఈసారి డేట్ విషయంలో తగ్గేదే లేదంటోంది పుష్ప టీమ్. కానీ అనుకొన్న సమయానికి ఈ సినిమా బయటకు రావడం దేవిశ్రీ ప్రసాద్ చేతుల్లోనే ఉంది. 'పుష్ప 2'కు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న సంగతి తెలిసిందే. పాటల విషయంలో దేవి చాలా స్పీడు. కానీ ఆర్.ఆర్‌కు మాత్రం సమయం తీసుకొంటాడు. పుష్ప లాంటి క్రేజీ సినిమాల విషయంలో తాను మరింత ఎఫర్ట్ పెట్టాలి. అందుకే తనకు ఎట్టి పరిస్థితుల్లో రెండు నెలల ముందు ఫుటేజీ ఇవ్వాల్సిందే అని దేవిశ్రీ ప్రసాద్ చెబుతున్నాడట. అంటే.. సెప్టెంబరు నెలాఖరుకు సినిమా మొత్తం పూర్తవ్వాలి. అప్పుడు సరిగ్గా దేవి చేతిలో రెండు నెలల సమయం ఉంటుంది. ఆర్.ఆర్ ఇవ్వడానికి ఈ మాత్రం సమయం కావాలి కూడా. అయితే సుకుమార్ ఆ టైమ్ లో అవుట్ పుట్ ఇవ్వగలడా? లేదా? అనే డౌటు ఉంది. సుకుమార్ కేవలం 40 రోజుల ముందే అవుట్ పుట్ ఇస్తానని దేవికి చెబుతున్నాడట. ఆ 40 రోజుల్లో ఆర్.ఆర్ పూర్తి చేయడం కత్తి మీద సామే. కొంతమంది సంగీత దర్శకులు సినిమాకు ముక్కలు ముక్కలుగా ఆర్.ఆర్ ఇస్తుంటారు. ఏ సీన్ అయితే ఆ సీన్‌కి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కొట్టేస్తారు. కానీ దేవి ఆ టైపు కాదు. సినిమా మొత్తం ఒకే ఫ్లో లో ఉండాలని కోరుకొనే వ్యక్తి. మొత్తం సినిమా తన చేతుల్లో ఉంటే గానీ, ఆర్.ఆర్. ఇవ్వడు. ఈ విషయం సుకుమార్‌కీ తెలుసు. కాకపోతే దేవి రెండు నెలల్లో చేయాల్సిన పనిని ఇప్పుడు 40 రోజుల్లో పూర్తి చేయాలి. అలా ఒత్తిడంతా సుకుమార్ నుంచి దేవిశ్రీ ప్రసాద్‌కు షిఫ్ట్ అయ్యింది.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

చిన్నారి పెళ్లికూతురు సీరియల్ ద్వారా తెలుగు ప్రేక్షకులకి సుపరిచితం అయిన బ్యూటీ అవికా గోర్. ఈ అమ్మడు ఉయ్యాల జంపాల సినిమాతో హీరోయిన్ గా కెరియర్ స్టార్ట్ చేసింది. మొదటి సినిమానే సూపర్ హిట్ అయ్యింది. తరువాత నాగ శౌర్యకి జోడీగా లక్ష్మి రావే మా ఇంటికి మూవీ చేసింది. ఈ సినిమా ఎవరేజ్ టాక్ తెచ్చుకుంది. మళ్ళీ రాజ్ తరుణ్ తో సినిమా చూపిస్త మావ మూవీలో నటించింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. అక్కడి నుంచి అవికా గోర్‌కి అవకాశాలు పెరిగాయి. తెలుగుతో పాటు కన్నడ, హిందీ భాషలలో కూడా అవికా గోర్ అవకాశాలు అందుకుంది. నిఖిల్ కి జోడీగా ఎక్కడికి పోతావు చిన్నవాడా మూవీతో మరో హిట్ ని అవికా గోర్ తన ఖాతాలో వేసుకుంది. తరువాత తెలుగుకి కొంత గ్యాప్ ఇచ్చింది. మరల స్లిమ్ అయ్యి రాజుగారి గది2తో సూపర్ హిట్ అందుకుంది. ఆ తరువాత అవికా గోర్ చేసిన సినిమాలు ఏవీ కూడా ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేదు. చివరిగా తెలుగులో ఉమాపతి అనే సినిమాలో అవికా గోర్ కనిపించింది. హిందీలో బ్లడీ ఇష్క్ అనే మూవీతో రీసెంట్ గా అవికా గోర్ ప్రేక్షకుల ముందుకొచ్చింది. హర్రర్ జోనర్ లో తెరకెక్కిన ఈ సినిమా ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేదు. అయితే బాలీవుడ్ లోనే ప్రస్తుతం అవికా గోర్ అవకాశాల కోసం ప్రయత్నం చేస్తోంది. దీనికోసం తనని తాను గ్లామర్ గా షోకేస్ చేసుకుంటుంది. రెగ్యులర్ గా హాట్ ఫోటోషూట్ లని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేస్తోంది. తాజాగా మరోసారి అదిరిపోయే అందంతో మెస్మరైజ్ చేసే లుక్స్ తో హాట్ ఫోటోలని అవికా గోర్ ఇన్ స్టాగ్రామ్ లో పంచుకుంది. లాంగ్ ఫ్రాక్ లో స్టైలిష్ గా ఫోజులిస్తూ తనలో ఉన్న యాటిట్యూడ్ ని ఈ ఫొటోలతో ఎలివేట్ చేస్తోంది. ఈ ఫోటోలకి అవికా గోర్ ఇంటరెస్టింగ్ కామెంట్ కూడా జోడించింది. గుండెలు బద్దలయ్యే విషయం ఒకటైతే. ఇందులో నా ఇగో ఇంకోటి కూడా ఉందంటూ పేర్కొంది. ఈ పిక్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నెటిజన్లు నుంచి అవికా గోర్ యాటిట్యూడ్ పిక్స్ పై అదిరిపోయే కామెంట్స్ వస్తున్నాయి.



# అవికా గోర్.. అల్ట్రా గ్లామర్!!

# ఇదేం పని రాజా??

సినిమా ఇండస్ట్రీలో హీరో హీరోయిన్ల మధ్య ప్రేమ వ్యవహారాలు అనేది చాలా కామన్.. ప్రేమ, డేటింగ్ అనే వ్యవహారాలను చాలా కామన్‌గా చూస్తూ ఉంటారు సెలబ్రిటీలు. కానీ కొంతమంది హీరోయిన్లు, హీరోలు మాత్రం వేరే వాళ్లతో ఘడమైన ప్రేమలో మునిగిపోతూ ఉంటారు. ఎంతలా అంటే వారిని పెళ్లి చేసుకునేంతలా.. అయితే ఇలా చేసుకున్న పెళ్లిళ్లు కొన్ని సక్సెస్ అయితే మరికొన్ని విఫలమవుతాయి.. అయితే గతంలో హీరోయిన్ ఇంద్రజ కూడా ఓ హీరోని గాఢంగా ప్రేమించిందని కానీ ఆ హీరో మాత్రం కేవలం సినిమాలో హీరోయిన్ గానే చూసారని ఓ గాసిప్ వినిపించింది. మరి ఆ హీరో ఎవరు అనేది ఇప్పుడు చూద్దాం.. యమలీల సినిమా ద్వారా మంచి గుర్తింపు సంపాదించిన ఇంద్రజ తర్వాత ఎన్నో తమిళ, కన్నడ, తెలుగు, మలయాళం సినిమాల్లో నటించింది. అయితే ఎన్ని సినిమాల్లో నటించినా కూడా ఈ హీరోయిన్‌కి స్టార్ హోదా మాత్రం రాలేదు. అలాగే కొన్ని సినిమాల్లో స్పెషల్ సాంగ్స్, గెస్ట్ రోల్స్ లో కూడా నటించింది. అలా ఇంద్రజకి ఎక్కువ స్టార్డం అయితే రాలేదు. అయితే ఇంద్రజ అప్పట్లో ఓ హీరోని ప్రేమించిందని, టాలీవుడ్ మీడియాలో ఎన్నో రూమర్స్ వినిపించాయి. ఇక ఆ హీరో ఎవరంటే రాజేంద్రప్రసాద్.. అప్పట్లో రాజేంద్రప్రసాద్‌పై హీరోయిన్‌ల విషయంలో ఎన్నో రూమర్స్ వినిపించాయి. అయితే అందులో ఎంత నిజముందో తెలియదు కానీ హీరోయిన్ ఇంద్రజకూడా రాజేంద్రప్రసాద్‌ని ప్రేమించిందని టాలీవుడ్లో కొంతమంది గుసగుసలు పెట్టుకున్నారు. ఇక వీరి మధ్య ఉన్న ప్రేమ కారణంగానే ఇంద్రజ ఆ హీరోతో కలిసి ఐదారు సినిమాల్లో స్క్రీన్ షేర్ చేసుకుందని భావించారు. కానీ రాజేంద్ర ప్రసాద్ ఇంద్రజలు మాత్రం హీరో హీరోయిన్స్‌గా స్క్రీన్ మీద మాత్రమే నటించారని, వారి మధ్య పర్సనల్‌గా ఎలాంటి రిలేషన్ లేదని ఆ తర్వాత బయట పడింది. ఇది కేవలం మీడియాలో వినిపించిన రూమర్ మాత్రమేనని అర్థమైంది.



- తెలుగులైవ్స్.కామ్ సౌజన్యంతో...



# కదిలించిన తండ్రి మరణం!



**స్వచ్ఛభారత్ వంటి ఎన్ని కార్యక్రమాలు వచ్చినా.. మనిషి తాత్కాలిక ఆనందాల వెల్లువలో దీర్ఘకాలంలో సంభవించబోయే విపత్తులను పట్టించుకోవడంలేదనే సంగతి ఇప్పటికీ బాధ్యతారాహిత్యమైన సమాజతీరుతో చాలాచోట్ల కళ్లకు కడుతూనే ఉంది. మరీ ముఖ్యంగా మానవ జీవితంతో బంధాన్ని పెనవేసుకున్న ప్లాస్టిక్ భూతం.. అదే మానవ జీవన సర్వనాశన హేతువవు తోందనీ తెలిసినా పొరపాటే అలవాటుగా మారిన తత్వం మనిషిది. ఈ క్రమంలోనే ఆ ప్రమాదాన్ని పసిగట్టి.. పర్యావరణ హితం కోసం పాటుపడుతున్న ఓ మనిషి గురించి చెప్పుకోవాలి. ఆ యువకుడే బిలాల్ అహ్మద్ దార్.**

క్యాన్సర్‌తో తండ్రి మరణంతో కశ్మీర్‌కు చెందిన బిలాల్ అహ్మద్‌కు కుటుంబ భారం పైబడటంతో పాటే.. తండ్రి మృతిచెందిన తీరు కదిలించింది. విషపూరిత నీళ్లల్లో జారిపడ్డప్పుడు అయిన గాయం పెద్దదై క్యాన్సర్‌కు దారితీసిన ఘటన మర్చిపోలేని అహ్మద్.. తండ్రి కుటుంబాన్ని పోషించేందుకు ఏ ఉపాధినైతే నమ్ముకున్నాడో, నమ్ముకుని ఏ బాటలోనైతే అసువులు బాసాడో.. అదే దారిలో మళ్లీ వెళ్లడమే అహ్మద్ చేస్తున్న ఆ విశేషపని! మరి తండ్రి మృత్యుబాట పట్టిన బాటనే మళ్లీ అహ్మద్ తన ఉపాధిగా ఎందుకెంచుకున్నాడు..?

అహ్మద్ బిలాల్ తండ్రిది చెత్త సేకరించే పని. ఆయనకు అహ్మద్‌తో పాటు భార్య, మరో ఇద్దరు కూతుళ్లు కూడా ఉండగా, అదే వారి కుటుంబాన్ని పోషించడానికి ఉపాధైంది. చెరువులు, కుంటలు, ఇతర చెత్త లభించే ప్రాంతాలే అహ్మద్ బిలాల్ తండ్రి ఉపాధి కేంద్రాలు. ఆ క్రమంలో ఉత్తర కశ్మీర్‌లోని బందిపోరా జిల్లా లహర్వార్ పొరాలోని వూలర్ చెరువును శుభ్రపరుస్తూ అందులో ఉన్న చెత్తనంతా సేకరించి అమ్ముతుండగా అహ్మద్ తండ్రి కాలుజారి చెరువులో పడి గాయాలయ్యాయి. ఓవైపు స్కూల్ చదువు కొనసాగిస్తూనే తండ్రి వెంట అహ్మద్ కూడా చెత్త సేకరించేందుకు వెళ్లేవాడు. ఆ సమయంలో పర్యావరణ హితం, నీటిని శుభ్రపర్చడానికి గల కారణాలు వంటివాటి గురించి అహ్మద్‌కు చెబుతూ పెంచాడు బిలాల్ తండ్రి. అయితే చెరువులో గాయపడ్డ అహ్మద్ తండ్రి కాలికి క్యాన్సర్ అని తేలింది. ఆ కారణంగా ఆ లెగ్ క్యాన్సర్‌తో అహ్మద్ ఎనిమిదో ఏటనే తండ్రిని కోల్పోయాడు. తల్లి, పెళ్లీడుకొచ్చిన సోదరీమణులు మొత్తంగా తన కుటుంబ భారం బిలాల్‌పై పడింది. అయితే బిలాల్ అప్పుడు కుటుంబ పోషణ కోసం ఇంకేదైనా ఉపాధిని వెతుక్కుని కష్టపడి పనిచేయొచ్చు. కానీ అలా చేస్తే మనం బిలాల్ గురించి ఇప్పుడెందుకు మాట్లాడుకుంటాం..?

పర్యావరణ హితం పట్ల తండ్రి కల్గించిన స్పృహ, సామాజిక బాధ్యత తన మెదడును తడుతూనే ఉన్నాయి. దాంతో తన తండ్రి ఏదైతే సాఫ్ సఫాయి కార్యక్రమాన్ని చేపట్టి తనవంతు బాధ్యతను నిర్వర్తించాలనుకున్నాడో అదే పనిని మళ్లీ అహ్మద్ కూడా తండ్రి వారసత్వంగా మొదలు పెట్టాడు. తల్లీ, తోడబుట్టినవాళ్లిద్దరూ వద్దని వారిస్తున్నా.. తండ్రి ఆ విషపూరిత చెరువు నీళ్లల్లో జారిపడటంతోనే క్యాన్సర్ బారిన పడి చనిపోయాడని చెబుతున్నా మళ్లీ ఆ బాటనే ఎంచుకున్నాడు. కారణం తండ్రి లక్ష్యాన్ని నెరవేర్చాలన్న ఓ సంకల్పం.. తన తండ్రి తనకు నేర్పించిన సామాజిక బాధ్యత. అలా ఎనిమిదేళ్ల వయస్సులో 2013లో ఓవైపు కుటుంబ భారాన్ని మోస్తూ తాను తండ్రి వలే చెత్త సేకరించే పనికి శ్రీకారం చుట్టి వూలర్ చెరువును స్వచ్ఛ చెరువుగా మార్చి పతాక శీర్షికలకెక్కాడు అహ్మద్. 2017లో మన్ కీ బాత్ లో ప్రధాని నరేంద్రమోదీ కూడా కొనియాడిన బిలాల్ దార్ శ్రీనగర్ మున్సిపాలిటీ బ్రాండ్ అంబాసిడర్‌గా మారాడు. జలాల్ ఉద్దీన్ బాబా అనే ఓ ఫిల్మ్ మేకర్.. బిలాల్ దార్ డాక్యుమెంటరీని నిర్మించగా.. అది ముంబై, యూఎస్‌లో పలు అవార్డ్సను గెల్చుకుంది. అలా బిలాల్ దార్ పేరుకు మరింత గుర్తింపు వచ్చింది. ఆ విధంగా తన తండ్రి కలను నెరవేరుస్తున్నాడు.

బిలాల్ దార్‌కు శ్రీనగర్ మున్సిపాలిటీ తమ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుని ఒక ప్రత్యేకమైన డ్రెస్‌తో పాటు, వెహికల్ కూడా అరేంజ్‌మెంట్ చేసింది. అలా శ్రీనగర్‌లో ప్రతీ ఇంటికీ, దుకాణానికీ వెళ్లి చెత్త సేకరించే పనికి ఓ బ్రాండ్ అంబాసిడర్‌గా అవతరించి.. సాఫ్ సఫాయికి కూడా ఒక ట్రెండ్ క్రియేట్ చేశాడు బిలాల్ దార్. తాను సమాజానికి, పర్యావరణహితంతో చేస్తున్న సేవ చూసి తరించిన అప్పటి ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ సోదరుడు తసాదఖ్ ముఫ్తీ ఒక స్పెషల్ బోట్‌ను చెత్త సేకరణ కొరకు బిలాల్ దార్‌కు బహుమతిగా ఇచ్చాడు. అప్పుడే ఓ ఇంటి నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం రూ.50 వేలనూ మంజూరు చేసింది.

వూలర్ చెరువు కశ్మీర్ కో, భారత్ కో మాత్రమే పరిమితమైన అందం కాదు.. ప్రపంచాన్నే ఆకర్షిస్తున్న ఓ పెద్ద సరస్సు. వాస్తవానికి 273 కిలోమీటర్ల పరిధిలో ఉండాల్సిన సరస్సు ఇప్పుడు కేవలం 72 కిలోమీటర్స్‌కి కుచించుకుపోయింది. ప్లాస్టిక్ భూతంతో పాటు కార్ల విడిభాగాలు, ఇతర చెత్తాచెదారమంతా ఆ సరస్సులో పేరుకుపోవడంతో పాటు గొలుసుకట్టు చెరువుగా ఓ అద్భుత సుందర దృశ్యంగా కనిపించాల్సిన వూలర్ సరస్సు నిర్వీర్యంగా మారే పరిస్థితికి వచ్చింది. అయితే, అదే చెరువు కారణంగా తన తండ్రి చనిపోయినా.. తన తండ్రి ఆశయానికి మాత్రం చావుండొద్దన్న ఒక సామాజిక స్పృహ బిలాల్ దార్‌ను సాఫ్ సఫాయిగా నిలబెట్టింది. యావత్ భారతం కొనియాడే స్థాయికి ఎదిగేలా చేసింది. చెత్త ఏరే పనికి కూడా సమాజం గౌరవమిస్తుందని చాటిచెప్పేలా చేసింది. అదే సమాజం ఇంకోవైపు తాము చేస్తున్న పనికి తల వంచుకుని సిగ్గుపడేలా.. ఇంకోవైపు తనను గౌరవించేలా కూడా ఇప్పుడు బిలాల్ సగౌరవంగా నిలబడ్డ స్వచ్ఛభారత్ బిడ్డడయ్యాడు.

వూలర్ చెరువును సాఫ్ సఫాయి చేసే క్రమంలో అక్కడ చెత్తను కొనే కబాడీవాలాకు ఏకంగా 12వేల కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను చెరువులోంచి తీసి అమ్మాడు అహ్మద్. అంతేకాదు.. తన స్నేహితుల సాయాన్నీ తీసుకున్నాడు. మొత్తంగా వూలర్ చెరువును ఓ శుభ్రమైన చెరువుగా తీర్చిదిద్ది ఎందరి ప్రశంసలకో అర్హుడయ్యాడు. అంతేనా.. ఓ సోదరి పెళ్లి కూడా జరిపించిన అహ్మద్ బిలాల్ దార్.. తన తల్లి కలగన్న తీరులో ఓ అందమైన భారీ భవంతి నిర్మాణం చేయాలన్న తలంపుతో పాటు మరో సోదరికి మంచి చదువు చెప్పించేందుకు తన చెత్త సేకరించే పనిని కొనసాగిస్తున్నాడు. రాబోయే మూడేళ్ల కాలంలో కశ్మీరంతా కలియతిరిగి క్లీన్ అండ్ గ్రీన్‌లో తనవంతు సామాజిక బాధ్యతను నిర్వర్తించడమే తన పని అంటున్నాడు. అందుకే ఇప్పుడు బిలాల్ అహ్మద్ దార్‌పై ఏకంగా అక్కడ డాక్యుమెంటరీలే నిర్మాణానికి నోచుకుంటున్నాయి మరి! ఇది కదా.. మరి పర్యావరణంపై సామాజిక బాధ్యత అంటే..?!!

**- రమణ కొంటికర్ల**

## కళాప్రపూర్ణ పాతూరి జయంతి వేడుకలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కళాప్రపూర్ణ పాతూరి నాగభూషణం 117వ జయంతి వేడుకలను బలగ శాఖా గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అయ్యంకి వెంకటరమణయ్య తర్వాత దాదాపు అర్ధ శతాబ్దం పాటు ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం రథసారథిగా ఉండి ఆంధ్రప్రదేశ్లో గ్రంథాలయ ఉద్యమాన్ని నలువైపులా విస్తరింపజేశారని, ఈ గ్రంథాలయ ఉద్యమం స్వాతంత్ర్య ఉద్యమానికి ఎంతో దోహదపడిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో సహాయకురాలు కె.అనిత, పాఠకులు పాల్గొన్నారు.



## ఘనంగా పాతూరి జయంతి

(సత్యంన్యూస్, లావేరు)

లావేరు శాఖా గ్రంథాలయంలో మంగళవారం కళా ప్రపూర్ణ పాతూరి నాగభూషణం 117వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. తొలుత గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాస రావు పాతూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయోద్యమానికి స్థిరమైన రూపురేఖలు దిద్దిన కళా ప్రపూర్ణ పాతూరి నాగభూషణం అని, అయ్యంకి వారి అనంతరం దాదాపు అర్థ శతాబ్దం పాటు ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ రథసారథిగా ఉండి, ఆంధ్రప్రదేశ్‌లో గ్రంథాలయోద్యమాన్ని బహుముఖాలుగా విస్తరింపచేశారని గుర్తుచేశారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బోటు గ్రంథాలయాలను తొలిసారిగా 1935-42 మధ్య తెనాలి బ్యాంక్ కాలువపై నిర్వహించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలకు గ్రంథాలయం తరపున బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.



## కెమెరా కన్ను చరిత్రకు సాక్ష్యం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కెమెరా కన్ను చరిత్రకు సాక్ష్యమవుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫొటోగ్రాఫర్ల సంఘం సోమవారం సాయంత్రం నగరంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్ప కళల్లో ఫొటోగ్రఫీ కూడా ఒకటని, ఫొటోగ్రఫీ వృత్తి ద్వారా అత్యున్నత స్థాయికి చేరుకున్నవారు ఎందరో ఉన్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని నేటితరం ముందుకు నడవాలన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్ సింగ్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ఫొటోగ్రాఫర్ అవసరముంటుందన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ సిపాయిల తిరుగుబాటు, స్వాతంత్ర్య పోరాటం కొన్ని దశాబ్దాల క్రితం పరిపాలనా విధానం గురించి చరిత్రకు సాక్ష్యంగా ఫొటోగ్రఫీ నిలిచిందని తెలిపారు. ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.జోగినాయుడు మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సహాయ సహకారాలు అవసరమన్నారు. జిల్లాలో సీనియర్ ఫొటోగ్రాఫర్ పొడుగు గజపతిని అతిథులు సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ కార్యదర్శి దేవీప్రసాద్, సంఘ ప్రతినిధులు కొర్లాడ కొండబాబు, లోపింటి చిట్టిబాబు, కిల్లంశెట్టి శ్రీనివాస్, జిల్లాలోని పలువురు ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

## అసిరితల్లికి సారెతో తిరువీధి

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

తమ్మినాయుడుపేటలో నాగావళి నదీతీరాన అమ్మ సంస్థాన్ ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న అసిరితల్లి అమ్మవారికి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సాగి శ్రీనివాసరాజు వర్మ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సారేతో తిరువిధి నిర్వహించారు. 108 రకాల స్వీట్స్‌తో పూజలు నిర్వహించారు. అలాగే అసిరితల్లి అమ్మవారికి దండకంతో పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఆలయ ప్రధానార్చకులు శ్రీపాద సురేష్ శర్మ తీర్థ ప్రసాదాలు అందజేశారు.



## హాస్టళ్లకు బయటి ఆహారం వద్దు: కలెక్టర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో ఉన్న హాస్టళ్లకు బయటి నుంచి ఎటువంటి ఆహారాన్ని అనుమతించకూడదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ వసతి గృహాలు, స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న బాలల రక్షిత గృహాలు, ప్రైవేట్ హాస్టళ్ల యాజమాన్యాలతో ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. డీఈవో తిరుమల చైతన్య మాట్లాడుతూ విద్యార్థులకు అక్షయపాత్ర నుంచి ఆహారం వస్తుందని, 500 మందికి మించి విద్యార్థులున్న హాస్టళ్లకు ప్రత్యేక అధికారి ఉండాలని చెప్పారు. హాస్టల్ యాజమాన్యాలతో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ శాంతిశ్రీ మెనూకు సంబంధించి పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి అనూరాధ, సోషల్ వెల్ఫేర్ డీడీ విశ్వమోహన రెడ్డి, రెసిడెన్షియల్ స్కూల్ కో-ఆర్డినేటర్ బాలాజీ నాయక్, కమిషనర్ చల్లా ఓబులేసు, ఆర్ఐఓ దుర్గారావు పాల్గొన్నారు.

## నిందితులు ఎంతటివారైనా చర్యలు తీసుకోవాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కోల్‌కతా నిర్భయ కేసులో నిందితులు ఎంతటి పెద్దవారైనా వెంటనే చర్యలు తీసుకోవాలని, మెడికల్ కళాశాలలో జూనియర్ మహిళా డాక్టర్‌ను పాశవికంగా అత్యాచారం చేసి హత్య చేస్తే సాక్ష్యాధారాలు నాశనం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన వైఖరి అనేక అనుమానాలకు తావిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం సాయంత్రం బీజేపీ మహిళా మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలి నుంచి సూర్య మహల్ కూడలిలోని వివేకానంద విగ్రహం వరకు కొవ్వొత్తులతో మహిళలు డాక్టర్లు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు ర్యాలీ తీశారు. మహిళా డాక్టర్‌కు రక్షణ కల్పించాలని, దేశంలో అశాంతి నెలకొల్పాలని చూసేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని, మమత వైఫల్యానికి బాధ్యత వహించి తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బైపల్లి రాజేశ్వరి, సింధూర ఆసుపత్రి ఎండీ డాక్టర్ సింధూర కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శవ్వాన ఉమామహేశ్వరి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పేడాడ సూర్యకుమారి, వి.వరలక్ష్మి, చింతపల్లి దుర్గారావు గాంధీ, బీన వంశీ, కోరాడ అప్పలరాజు, సరళ, పూజారి చెల్లయ్య, ఆరంగి తిరుపతిరావు, వి.ఉమామహేశ్వరరావు, మామిడి శ్రీకాంత్, గురుగుబెల్లి రాజు, పారనంది విజయకుమార్, లక్ష్మీనారాయణ, పి.సూర్యారావు, గోపీ, ప్రభావతి, కామేశ్వరి, ఈశ్వరమ్మ విద్యార్థులు. స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.













# దేశానికి గొప్ప సంపద రాజీవ్‌గాంధీ




(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

భారతదేశాన్ని 21వ శతాబ్దంలోకి నడిపించిన నవ నాయకుడు రాజీవ్ గాంధీ కాంగ్రెస్ పార్టీకే కాక దేశానికి గొప్ప సంపదగా మిగిలిపోయారని శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వర రావు అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా శ్రీకాకుళం డీసీసీ కార్యాలయం ఇందిరా విజ్ఞాన్ భవన్లో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశాన్ని సాంకేతిక యుగంలోకి నడిపించడమే కాకుండా దేశ సమగ్రత అభివృద్ధి సమైక్యతకు కట్టుబడిన నాయకుడని అన్నారు. రాజీవ్ జయంతి సందర్భంగా బెహరా మనోవికాస కేంద్రం విద్యార్థులకు కాంగ్రెస్ నాయకులు పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో శ్రీకాకుళం పట్టణ పార్టీ అధ్యక్షుడు డి.గోవిందమల్లిబాబు, ఆమదాలవలస అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి, పీసీసీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాసుపత్రి చక్రవర్తిరెడ్డి, నరసన్నపేట ఇన్‌ఛార్జి మంత్రి నరసింహమూర్తి, పీసీసీ అధికార ప్రతినిధి చింతాడ దిలీప్, జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షులు కోత మధుసూదన్ రావు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కేవీఎల్ఎస్ ఈశ్వరి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేష్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కొత్తూరు శైలజ, డాక్టర్ కవిటి గోపాలకృష్ణ, దాట్ల లింగమూర్తి, జి.అప్పారావు, పప్పు జగ్గారావు, ఆబోతుల వెంకట్‌నాయుడు, ఐ. రమణ, ఎం.సత్యనారాయణ, కోత శంకర్ ప్రసాద్, సంపతిరావు సత్యనారాయణ, పేడాడ సూర్యనారాయణ, దీర్ఘాసి వెంకట్రావు, మామిడి సత్యనారాయణ, జీపీ నాయుడు, బద్రి సీతమ్మ యాదవ్, బీసీ సంఘ నాయకులు బేనా ఢిల్లీరావు, అమీరుల్లా బేగ్ పాల్గొన్నారు.

## గ్రీన్‌సిటీగా మార్చటంలో భాగమౌదాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)



శ్రీకాకుళం నగరాన్ని సుందర నగరంగా మారుద్దామని, గ్రీన్ సిటీగా మార్చే బాధ్యతను ప్రతిఒక్కరు తీసుకోవాలని శ్రీకాకుళం దిశ ఎస్ఐ మొజ్జాడ ప్రవల్లిక మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి వ్యవస్థాపకులు శిల్లా రమేష్ ద్వారా ఢిల్లీకి చెందిన సంస్థ గూంజ్ సహకారంతో సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి ఆధ్వర్యంలో 25వేల ఉచిత వృక్షజాతి మొక్కల పంపిణీ కార్యక్రమం నేటి నుంచి ప్రారంభమౌతుందని, సింగుపురం గ్రామ హైస్కూల్ గ్రౌండ్లో మొక్కలున్నాయని, ఈ మహత్తర కార్యక్రమానికి జిల్లాలో ఉండే అన్ని స్వచ్ఛంద సంస్థలు నడుం బిగించాలని కోరారు. సంస్థ సభ్యులు ఉర్లం శివతేజ మాట్లాడుతూ కాలుష్య రహిత జిల్లాగా ఉంచడానికి మనమంతా భాగమవ్వాలన్నారు. మొక్కలు నాటేటప్పుడు ఫొటోలు తీయాలని, మొక్కలు కావలసిన వారు 7075 666 108, 810 62 18184, 91609 66095, 63095 88342 నెంబర్లను సంప్రదించాలన్నారు.

# రైతులకు అండగా ప్రభుత్వం

### శివారు ప్రాంతాలకు సాగునీరందేలా చర్యలు

### పూడిక తొలగింపు పనులు పరిశీలించిన ఎమ్మెల్యే శంకర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




వంశధార పిల్లకాలువల్లో పూడికతొలగింపు పనులు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ చొరవతో ప్రారంభమయ్యాయి. మంగళవారం ఈ పనులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఆయకట్టు శివారు రైతులకు పూర్తిస్థాయిలో నీరు అందించి అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కుడి ప్రధాన కాలువకు ఆనుకొని ఉన్న పల్లివలస పిల్లకాలువ పూడికలతో నిండిపోయింది. ఈ సమస్య పరిష్కరించాలని రైతులు ఎమ్మెల్యే శంకర్‌ను కోరగా ఆయన ఆదేశాల మేరకు పల్లివలస డంపింగ్ యార్డు సమీపంలోని 29ఎల్ డిస్ట్రిబ్యూటరీ పరిధిలో జంగిల్ క్లియరెన్స్, సిల్ట్ తొలగింపు పనులు ప్రారంభించారు. ఈ పనులు పూర్తి అయితే సింగుపురం గ్రామ పరిధి వరకు నీరు సరఫరా అవుతుందని తెలిపారు. మంగళవారం పనులను పరిశీలించిన ఆయన అధికారులు, స్థానిక నాయకులకు పలు సూచనలు చేశారు. అదే విధంగా 27ఎఆర్ డిస్ట్రిబ్యూటరీలో కూడా జంగిల్ క్లియరెన్స్, సిల్డ్ తొలగింపు పనులు ప్రారంభించారు. ఈ పిల్లకాలువల ద్వారా రూరల్ మండల పరిధిలోని ఐదు గ్రామాలు లంకాం, లింగాలవలస, గూడెం, చంద్రయ్యపేట, పాత్రునివలసల పరిధిలో వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని ఎమ్మెల్యే తెలిపారు. పూడిక సమస్యపై రూరల్ మండల రైతులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పరిష్కరించకపోవడంతో సాగు నీరందక ఇబ్బందులు పడ్డారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రధాన కాలువలతో పాటు పిల్ల కాలువల్లోని పూడికలు తొలగించి రైతుల మోముల్లో ఆనందం నింపుతున్నామన్నారు. రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అన్నదాతకే మొదటి ప్రాధాన్యమని చెప్పిన వైకాపా ప్రభుత్వం అన్నదాత వెన్నువిరిచిందన్నారు. ఆ ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి లేదని చెప్పడానికి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడమే నిదర్శనమన్నారు. శ్రీకాకుళం రూరల్, గార మండలాల్లో ఇప్పటికే పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి వేలాది ఎకరాలకు సాగునీరు అందించామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు.

## పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి




(సత్యంన్యూస్, నరసన్నపేట)

ప్రతి విద్యార్థి ఒక పారిశ్రామికవేత్తగా ఎదిగి పలువురికి ఉపాధి అవకాశాలు కలిగించాలని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ స్మాల్ బిజినెస్ డెవలప్‌మెంట్ మాస్టర్ ట్రైనర్ మోహన్ అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన పారిశ్రామిక రంగం–ప్రభుత్వ ప్రోత్సాహకాలు అనే సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య అనుసంధానం, అవగాహన అంతో అవసరమన్నారు. విద్యార్థులు ఉద్యోగాల కోసం చూడకుండా తమ ప్రాంతాలకు అనువైన పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్, ఎకడమిక్ ఇన్‌ఛార్జి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## తేజోమూర్తుల విగ్రహాల చుట్టూ తుప్పల తొలగింపు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కిమ్స్ రోడ్డులో సింహద్వారం వరకూ ఇంటాక్ శ్రీకాకుళం స్థాపించిన తేజోమూర్తుల విగ్రహాలపై పెరిగిన చెట్టు కొమ్మలను తొలగించి, విగ్రహాల చుట్టూ పేరుకుపోయిన చెత్తను, తుప్పలను తొలగించే పనిని ఇంటాక్ బృందం సోమవారం ప్రారంభించింది. కన్వీనర్ నూకా సన్యాసిరావు, కో కన్వీనర్ నటుకుల మోహన్, అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథ నాయుడు మాట్లాడుతూ కిమ్స్ రోడ్డులోని అన్ని విగ్రహాలను, పరిసరాలను పరిశుభ్రంగా తయారుచేసి, శుద్ధ జలంతో కడిగిస్తామని తెలిపారు. సోమ, మంగళ, బుధ వారాల్లో ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. కొంత మంది ఆ విగ్రహాల శిలాఫలకాలపై పోస్టర్లు అతికిస్తున్నారని, బేస్మెంట్లపై రాతలు రాస్తున్నారని, ఇటువంటివి చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఇటీవల కాలేజీ రోడ్డులోని మల్లయోధుడు కోడి రామమూర్తి నాయుడు విగ్రహానికి రంగులు వేయించామని తెలిపారు.



పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో జిల్లా చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ తరపున మంగళవారం గుజరాతిపేట వరం స్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమం వరం కుమారుడు సంతోష్ చేతుల మీదుగా జరిగింది. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వంజరాపు రాము, పైడి శ్రీనివాస్, నరసింహం, బూరవెల్లి శ్రీనివాసరావు, గోపి శంకర్, సత్యనారాయణ, జిలానీ, కింతాడ సంతోష్, అప్పారావు, గిరి, హుస్సేన్, వురిటి సునీల్ కుమార్, సూర్య పవన్, పోస్ట్‌మాన్ శ్రీనివాసరావు, రామారావు, జళ్లేపల్లి రామారావు, టి.తిరుమలరావు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్

## ముత్యం మృతికి సాహితీ, ప్రజా సంఘాల సంతాపం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



శ్రీకాకుళ విప్లవోద్యమ సాహిత్య పరిశోధకులు, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ సాహిత్య సాంస్కృతిక పరిశోధక రచయిత డాక్టర్ కె.ముత్యం ఆకస్మిక మృతికి పలు సాహితీ సాంస్కృతిక ప్రజా సంఘాలు సంతాపం ప్రకటించాయి. సుమారు 24 ప్రసిద్ధ పుస్తకాల రచయితగా చరిత్రలో నిలిచిపోయిన డాక్టర్ ముత్యం బ్రెయిన్ స్ట్రోక్‌తో మూడేళ్లుగా అస్వస్థతకు గురై భౌతికంగా విశ్రాంతిలో ఉంటూ బెడ్ రెస్ట్‌లో సైతం రచనా వృత్తిని సాగించారు. ఆయన మంగళవారం తెల్లవారు జామున 2 గంటలకు గుండెపోటుతో మరణించడం సాహిత్య సాంస్కృతిక రంగానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ తన సంతాప ప్రకటనలో పేర్కొన్నారు. ముత్యం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పలు విప్లవ ప్రజా సంఘాల నాయకులు, సాహితీ సాంస్కృతిక సంస్థల నాయకులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. సంతాపం తెలిపినవారిలో తాండ్ర ప్రకాష్, డాక్టర్ మట్ట ఖగేశ్వరరావు, గొరకల బాలకృష్ణ, పోతనపల్లి కుసుమ, మల్లిబాబు, సార జగన్, బెందాళం కృష్ణారావు, చింతాడ కృష్ణారావు, వంకల రాజారావు, బద్రి కూర్మారావు తదితరులు ఉన్నారు. నాలుగున్నర దశాబ్దాల క్రితం ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల విద్యార్థి సంఘానికి పీడీఎస్‌యూ తరపున అధ్యక్షులుగాను, బెనారస్ యూనివర్సిటీ విద్యార్థిగానూ ముత్యం విద్యార్థి జీవితాన్ని గడిపారు.

# అడకత్తెరలో మమత

(మొదటిపేజీ తరువాయి)

విధానం వంటి అనేక ఆరోపణలు ఎదుర్కొంటోన్న సందీప్‌కు తృణమూల్ పార్టీతో సన్నిహిత సంబంధాలున్నాయి. ఇంతకుముందు అతని భారీ అవినీతిపై రాష్ట్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదులందినా ఎలాంటి చర్యలూ లేవు. ఆ సమయంలో కేసు నమోదు చేసిన ఆర్‌టిఐ కార్యకర్త అక్తర్ అలీని ఆసుపత్రి నుంచి బదిలీ చేసారు. ఇప్పుడు అక్తర్ అలీ ప్రిన్సిపాల్‌ను మాఫియా డాన్ అని పిలుస్తున్నాడు. వైద్య విద్యార్థుల వద్ద డబ్బులు సేకరించడం, టెండర్ల ప్రక్రియను నీరుగార్చడం, ఆసుపత్రిని అవినీతిమయం చేయడం చేస్తున్నాడని గట్టిగా ప్రచారం చేస్తున్నాడు. ఘోష్‌ను ఇదివరలో రెండుసార్లు బదిలీ చేసినప్పటికీ, చాలా విచిత్రంగా చిటికవేసేలోగా మళ్లీ ఆర్‌జి కార్ ఆసుపత్రికే ప్రిన్సిపాల్‌గా వచ్చేసాడు. ఈ దుర్ఘటన జరిగిన తర్వాత జరుగుతున్న పరిణామాలను పరిశీలించి తన పదవికి రాజీనామా చేసాడు. కాని, అదే రోజు నేషనల్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఉద్యోగం వచ్చేసింది. కోల్‌కతా హైకోర్టు ఆపకపోయుంటే ఆ కాలేజీకి ప్రిన్సిపాల్ అయ్యేవాడే. ఆయనకు రక్షణ కావాలని వేసిన పిటిషన్‌ను తిరస్కరిస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, 'ఈ వ్యక్తి చాలా శక్తిమంతుడు. రాష్ట్రమే అతని పక్షాన ఉంది. అతనికి రక్షణ కావాలంటే పోలీసులు అందిస్తారు. ఆయన 500 మంది పోలీసులు కావాలని కోరుకున్న మరుక్షణమే 500 మంది పోలీసులు ఆయన ఇంటిగుమ్మం ముందు నిల్చుంటారు. అతనికెందుకయ్యా రక్షణ!' అని ఆగ్రహంగా వ్యాఖ్యానించారు.

ఇంకా కేసు దర్యాప్తు జరుగుతుండగా, ఆసుపత్రి ఛాతీ విభాగం వద్ద పునర్నిర్మాణ పనులు ఎందుకు మొదలుపెట్టినట్టు? బుధవారం ఈ కేసును సిబిఐకి అప్పగించారు. కాని, అప్పటికే ఆ ఛాతీ విభాగంలో మరమ్మతు పనులు చాలా కంగారుగా మొదలుపెట్టేసారు. వైద్యురాలి మృతదేహం పడిఉన్న చోటనే మరమ్మతు పనులు ఎందుకు చేపట్టినట్టు? కేవలం సాక్ష్యాలను చెరిపేయడానికేనా! వైద్యురాలి మృతదేహం లభించిన చోటున్నగది, దానిని ఆనుకుని ఉన్న మూత్రశాలను కొట్టేయాల్సిందిగా దుర్ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత ఆదేశాలు తయారు చేసినట్టు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రాసింది. దీనినే జూనియర్ డాక్టర్లు, ఇతర వైద్య విద్యార్థులు తీవ్రంగా అనుమానిస్తున్నారు.

ఆ రోజు రాత్రి జరిగిన దుర్ఘటనను వ్యతిరేకిస్తూ వైద్య విద్యార్థులు నిరసన తెలుపుతున్నప్పుడు అల్లరి మూకలు వారితో చేరి ఆసుపత్రిపై దాడి చేసాయి. ఈ పని కచ్చితంగా భారతీయ జనతా పార్టీ, సిపిఐ (ఎం) పార్టీ చేసిందని ముఖ్యమంత్రి అభియోగం మోపారు. కాని, మీడియా తీసిన ఫోటోలలో దాడులకు పాల్పడిన వారంతా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లతో సంబంధాలు ఉన్నవారే ఉండడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. నిర్భయ దుర్ఘటన జరిగిన తర్వాత దేశవ్యాప్తంగా రాజుకున్న చిచ్చు కాంగ్రెస్ పార్టీకి మంగళం పాడడానికి దారితీసింది. బహుశా ఇప్పుడు దుర్ఘటన జరిగిన తీరును పరిశీలించినప్పుడు కూడా పశ్చిమ బెంగాల్‌లో మమత పరిపాలన అంతానికి ఇది ఆరంభంలా కనిపిస్తోంది.

# ఈసారైనా 'రింగు' తిరుగుతుందా?!

మొదటిపేజీ తరువాయి

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న చంద్రబాబు ఓఆర్ఆర్ నిర్మాణానికి రూ.150 కోట్లు కేటాయించనున్నట్టు ప్రకటించారు. దీంతో అధికారులు పాత ప్రతిపాదనను పక్కనపెట్టి 2018 సెప్టెంబర్ మూడో తేదీన ఓఆర్ఆర్ పరిధిలోకి వచ్చే ప్రాంతాలను గుర్తించే ప్రక్రియ మళ్లీ చేపట్టారు. నగరం చుట్టూ ఐదు కిలోమీటర్ల పరిధిలో ఐదు మండలాల్లోని 18 గ్రామాలను కవర్ చేసేలా ఓఆర్ఆర్ నిర్మించాలని నిర్ణయించారు. కానీ దీన్ని కూడా పరిగణనలోకి తీసుకోలేదు. మూడో ప్రతిపాదన మేరకు నవభారత్ జంక్షన్ నుంచి తోటపాలెం, పొన్నాడ మీదుగా పొన్నాడ వంతెన, కలెక్టరేట్ లోపలి నుంచి కొత్తపేట, ఖాజీపేట, అరసవల్లి ఇంద్ర పుష్కరిణి, అమ్మవారి ఆలయం, పెదపాడు మీదుగా పాత్రునివలస వద్ద జాతీయ రహదారికి అనుసంధానం చేయాలని నిర్ణయించారు. జాతీయ రహదారి, నాగావళి తీరం, గెడ్డగట్లు మినహా మిగిలిన ప్రాంతాల్లో రింగ్‌రోడ్డు నిర్మించేలా డీపీఆర్ సిద్ధం చేశారు. రహదారి మధ్యలో డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, మొక్కలు, రహదారికి ఇరువైపులా కాలువలు, బస్ షెల్టర్ల ఏర్పాటుకు రూ.150 కోట్లు, రోడ్ల నిర్మాణం, పరిహారం చెల్లింపునకు రూ.340 కోట్లు అవసరమని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా గ్రామసభలు నిర్వహించి 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని నిర్ణయించారు. చివరికి దీన్ని కూడా అటకెక్కించారు. ఉడా నుంచి సుడా పరిధిలోకి శ్రీకాకుళం మారడంతో వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత రింగ్ రోడ్డు ప్రతిపాదన మరుగున పడిపోయింది.

### ప్రభుత్వం పూనుకోకుంటే కష్టమే

నగర అవసరాలకు ఔటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదన ఎంతో అవసరం. జనాభా పరంగా చూస్తే మున్సిపాలిటీకి ఎక్కువ, నగరపాలక సంస్థకు తక్కువ. మూడు లక్షల జనాభా ఉంటేనే నగరపాలక సంస్థ హోదా కల్పించాలి. అయితే 2 లక్షల కంటే తక్కువ జనాభా ఉన్నా శ్రీకాకుళం మున్సిపాలిటీని అప్‌గ్రేడ్ చేసి 2009లోనే నగరపాలక సంస్థ చేసేశారు. సుమారు 2 లక్షల జనాభా కలిగిన నగరాల్లో పదేళ్లకోసారి అంతర్గత రోడ్లను విస్తరించాల్సి ఉన్నా రాజకీయ నాయకులు జోక్యంతో ఆశించిన స్థాయిలో జరగడం లేదు. మాస్టర్ ప్లాన్ ప్రకారం నగరంలో రోడ్లు విస్తరణ జరిగితే మౌలిక సదుపాయాలు మెరుగై ఉండేవి. కానీ అలా జరక్కపోవడంతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతోంది. వీటన్నింటికీ ప్రత్యామ్నాయం ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణమే. కానీ ఉడా నుంచి తప్పించి సుడా ఏర్పాటు చేసి నగరాభివృద్ధికి నిధులు అందే అవకాశం లేకుండా చేశారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత రింగ్‌రోడ్డు నిర్మాణం విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు విఫలమయ్యారు. సుడా వద్ద నిధుల్లేక 2019 నుంచి రోడ్లు, ఇతర నిర్మాణాలు నిలిచిపోయాయి. ఈ పరిస్థితుల్లో రింగ్‌రోడ్డు నిర్మాణానికి అవసరమైన రూ.500 కోట్లకుపైగా నిధులు సమకూర్చుకోవడం సుడా వల్ల కాని పని. మరోవైపు ప్రభుత్వం పూర్తిగా ఆ నిధులు కేటాయించడం లేదంటే వివిధ ఆర్థిక సంస్థల ద్వారా నిధుల సమీకరణకు అవకాశం కల్పిస్తేనే రింగ్‌రోడ్డు ప్రతిపాదన సాకారమవుతుందని అంటున్నారు.

## రాజీవ్‌కు ఘన నివాళి

(సత్యంన్యూస్, విశాఖపట్నం)

భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా విశాఖ బీచ్ రోడ్డులోని రాజీవ్ కాంస్య విగ్రహానికి కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశాఖ నగర అధ్యక్షులు శ్రీనివాస్, సేవాదళ్ అధ్యక్షులు బమ్మిడి గంగాధర్, పలువురు నేతలు పాల్గొన్నారు.



## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### - డీఎంహెచ్‌ఓ డాక్టర్ మీనాక్షి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా దోమలవ్యాప్తిని అరికట్టాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.మీనాక్షి అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ మీనాక్షి జెండా ఊపి అవగాహన ర్యాలీ ప్రారంభించారు. ర్యాలీ 7రోడ్ల కూడలి వరకు కొనసాగింది. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ దోమరహిత గ్రామం, జిల్లా, రాష్ట్రం, దేశంగా తీర్చిదిద్దేలా ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. 1897 ఆగస్టు 20న దోమల నివారణ దినోత్సవంగా ప్రకటించారని, దోమల నుంచి మలేరియా వ్యాపిస్తుందని సర్ రోనాల్డ్ రాస్ కనుగొనడంతో అప్పటి నుంచి ప్రతి ఏటా ప్రపంచ దోమల నివారణ దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. దోమలు కుట్టడం వల్ల అనేక వ్యాధులు ప్రబలుతున్నాయని, వ్యాధులు ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని, మలేరియా, ఫైలేరియా, డెంగీ వంటి ఎన్నో వ్యాధులకు దోమలే కారణమన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పి.వి.సత్యనారాయణ, ఏఎంవో ఎస్.శ్రీనివాస్, డీసీ శ్రీకాంత్, హెల్త్ ఎగ్జిక్యూటర్ పి.మోహిని, సామాజిక కార్యకర్త డాక్టర్ మంత్రి వెంకటస్వామి, లక్ష్మణరావు, జయలక్ష్మి, మలేరియా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్‌లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.




# సమాజ సేవకు ముందుండాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సమాజసేవలో మనమంతా ముందుండాలని, ఏ ఒక్కరి వలన ఏదీ సాధ్యపడదని, అందరం కలసికట్టుగా చేస్తేనే సాధ్యపడుతుందని, జీవితంలో కొంత సమయాన్ని సమాజసేవకు కేటాయించాలని పెద్దపాడుకు చెందిన పల్లా అప్పలసూరి మనవడు బొట్టా సాయి కుమార్ అన్నారు. నీలమ్మ కాలనీకి చెందిన మానాపురం గౌరీశంకర్ మనవరాలు కె.దివ్యజ్యోతి రెండు కిడ్నీలు పాడై మంచానికే పరిమితమైంది. వీరి దీనస్థితిని దమ్మలవీధికి చెందిన తవుడు, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ నంది ఉమా శంకర్‌కు తెలుపగా, స్పందించిన ఉమా, తన వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేశారు. తక్షణమే స్పందించిన సాయికుమార్ రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులను, కూరగాయలు, రైస్ ప్యాకెట్‌తోపాటు, ఆమెకు అవసరమైన చక్రాల కుర్చీని మంగళవారం అందించారు. రక్షాబంధన్ సందర్భంగా సేవలో భాగంగా ఈ చిరు సాయాన్ని అందించి ఆదుకోవటం ఆనందంగా ఉందని సాయికుమార్ అన్నారు. ఈ సందర్భంగా దివ్యజ్యోతి కుటుంబ సభ్యులు ఉమాశంకర్‌కు, దాత సాయికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యకమంలో ఉర్లం శివతేజ, సుప్రజ రౌత్, అల్లాడ నవీన్, పొదుగు చరణ్, పొదుగు అవినాష్, తవుడు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.